32

ఓం నమో భగవతే శ్రీరమణాయ

# రమణభాస్కర

26

## (మార్టేరులో శ్రీ నాన్నగారి ప్రవచనము 4-2-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

గురువు అంటే దేహమే అని మనం అనుకొంటాము. గురువును దేహమునకు పరిమితం చేస్తాము. కాని గురువు దేహమునకు పరిమితమై ఉండడు. దేహములో ఉన్నా తాను దేహమాత్రుడను కాదు అని గురువుకు తెలుస్తూ ఉంటుంది. గురువు దేహమాత్రుడు కాదు కాబట్టి గురువు దేహం పడిపోయినా ఆయనతో మనకు ఉన్న సంబంధము కొనసాగుతూ ఉంటుంది. గురువు అంటే దేహము కాదు. గురువు అంటే సద్వస్తువు. గురువు అంటే ఆత్మ.

చాలామంది పాడైపోవటానికి రెండు కారణములు భగవాన్ చెపుతున్నారు. 1. సహవాసదోషము, 2. అలవాట్లలో లోపము. మనకు అవసరమైనదానికంటే ఎక్కువ తింటున్నాము. మనకు అవసరమైన దానికంటే ఎక్కువ నిద్ర పోతున్నాము. అవసరమైన దానికంటే ఎక్కువ మాట్లాడుతున్నాము. వీటి వలన మనము పాడవుతున్నామని చెపుతున్నారు. మాటలు ఎక్కువగా అలవాటు అయిపోయి కొంతసేపు కుదురుగా కూర్చోమంటే కూర్చోలేరు. మౌనంగా ఉండమంటే ఉండలేరు. ఎందుచేతనంటే మౌనం యొక్క విలువ మనకు తెలియటంలేదు. ఆహార విషయంలో జాగ్రత్తగా ఉండలేకపోతున్నారు, మౌనమును అభ్యాసము చేయలేకపోతున్నారు. సహవాసం విషయంలో జాగ్రత్తగా ఉండలేకపోతున్నారు. అందువలన మనస్సు పాడవుతోంది. అందువలన మనస్సును స్వాధీనం చేసుకోవటం కష్టమవుతోంది.

మన శరీరము మన స్వాధీనంలో ఉండదు అనుకోండి, మన ఇంద్రియాలు మన స్వాధీనంలో ఉండవు అనుకోండి, మన మనస్సు మన స్వాధీనంలో ఉండదు అనుకోండి లోపల ఉన్న సత్యవస్తువును తెలుసుకొనే సమస్యే లేదు అని భగవాన్ చెపుతున్నారు.

కొంతమంది చిన్నమాట అంటే పడలేరు. అంటే వారి మెదడులో ఉన్న దోషం. కొంతమంది విషయమును తొందరగా గ్రహించలేరు. కాని ఓర్పుగా ఉంటారు. కొంతమంది ఓర్పుగా ఉంటారు గాని సూక్ష్మబుద్ధి తక్కువగా ఉంటుంది. అన్ని కళ్యాణగుణాలు మన మెదడులోనికి రావాలంటే ఈశ్వరానుగ్రహం అవసరము. మెదడులో ఉన్న అన్ని కోణాలు వికశిస్తే పూర్ణస్థితి మనకు కలుగుతుంది. అంటే జీవితంలో ఇంక వెలితి మనకు కనబడదు.

మనం ఎరుకతో పనులు చేయము, ఎరుకతో మాట్లాడము. మనం చేసిన పనులకు, మాట్లాడిన మాటలకు తరువాత పశ్చాతాప పడతాము. అందువలన చేసే పనుల విషయంలోనూ, మాట్లాడే మాటల విషయంలోనూ ఎరుకతోఉండాలి.

ఆత్మనిష్ఠ వలన మనకు ఆత్మ తెలియబడుతుంది. మనం మాట్లాడే మాటలు, మనం చేసే పనులు, మన శరీరము, మన మనస్సు, మన ఇంద్రియాలు మనకు సహకరించకపోతే మనకు ఆత్మనిష్ఠ కలుగదు. ఆహారనియమము సరిగాలేకపోతే మనస్సు, శరీరము నీకు సహకరించవు.

మన ఆలోచనలో ఉన్న దోషం వలన, ఆహారనియమం సరిగా పాటించనందువలన, చెడు అలవాట్లవలన

చాలామందికి అనారోగ్యం, దారిద్ర్యం వస్తాయి. ఇవి రెండూ మనిషిని పీడిస్తాయి. అలవాట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

మనకు వచ్చే తలంపులు మనకు సహకరించేలాగ ఉండాలి. ఎవరికైనా సహాయం చేసినపుడు నేను వాడికి సహాయం చేసాను అని రజోగుణం ఉన్నవాడు అనుకొంటాడు. సహాయం చేయటానికి వారు నాకు అవకాశము ఇచ్చారు అని సత్వగుణం ఉన్నవాడు అనుకొంటాడు. అదీ తలంపే. ఇదీ తలంపే. కాని సత్వగుణం తలంపు నిన్ను బంధము నుండి విడదీస్తుంది. రజోగుణం తలంపు నిన్ను బంధములోనికి గెంటుతుంది. అందువలన తలంపుల విషయంలో బహు జాగ్రత్తగా ఉండాలి.

ప్రకృతి మనుషులు చెప్పిన మాటలు తీసుకోవద్దు. శాస్త్రమును ప్రమాణంగా తీసుకోవాలి. భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకోవాలి. భగవంతుడు చెప్పినమాటలు మనం చదివినా వాటిమీద మనకు హృదయపూర్వకంగా విశ్వాసం కుదరటం లేదు. దీనికి కారణము మన మనస్సులో ఉన్న దోషములు. అవి నిజం అయినప్పటికీ మన మనస్సులో ఉన్న దోషముల కాతణంగా ఆ నిజమును మనం గ్రహించలేక పోతున్నాము.

అది గ్రహించే శక్తి మనకు రావటానికి ఇలా మనం జన్మలు ఎత్తి మొట్టికాయలు తింటూఉంటాము. ఇలా జన్మలు ఎత్తి మొట్టికాయలు తినగా తినగా కర్మ అనుభవించగా, అనుభవించగా కర్మానుభవం పూర్తి అయ్యాక ఏదో ఒక జన్మలో గ్రహింపు కలుగుతుంది. భగవంతుడు చెప్పినదే నిజం మనం కాలమును వృధా చేసుకొన్నాము అని తెలుస్తుంది.

ఉన్నవాడు ఒక్కడే అని చెపుతున్నారు. వాడు అందరి హృదయములలో అంతర్యామిగా ఉన్నాడు అని చెపుతున్నారు. వాడిని తెలుసుకోవటానికి విచారణ ఒక్కటే సరిపోతుందా లేక ఇంకా ఏమైనా పద్ధతులు అవలంభించాలా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. విచారణ వలననే జ్ఞానం వస్తుంది. మిగిలిన విషయములు అవసరమా అంటే అవసరమే. మిగిలిన విషయముల వలన జ్ఞానం వస్తుంది అని కాదు. అవి విచారణకు సహాయపడతాయి. ఆహారనియమంవలన, మౌనం వలన, సజ్జన సహవాసం వలన మనకు క్రమశిక్షణ కలుగుతుంది. క్రమశిక్షణ లేకపోతే మనం ఏదీ సాధించలేము. ఆ నియమముల వలన మనస్సుకు కుదురు కలుగుతుంది. కుదురుపడిన మనస్సు, శాంతపడిన మనస్సు, శుద్ధిపడిన మనస్సు విచారణ చేయటానికి యోగ్యత సంపాదిస్తుంది. విచారణ వలననే జ్ఞానం వస్తుంది. విచారణకు సహకరించే విషయములను మనం ప్రోగుచేసుకోవాలి.

ఆహారనియమం ఉంది అనుకోండి. ఆహారనియమం వలన జ్ఞానంరాదు. ఆహారనియమం వలన మనస్సు, శరీరము క్రమశిక్షణలో ఉంటాయి. తక్కువుగా మాట్లాడాలి. మనస్సుకు మౌనం అలవాటు చెయ్యాలి. మనస్సుకు మౌనం అలవాటు చేస్తే అహంభావన తగ్గుతుంది. మనం మాట్లాడే మాటలు అన్నీ అవసరము ఉండి మాట్లాడుతున్నామో, అవసరము లేకుండా మాట్లాడుతున్నామో అని చూసుకోవాలి. అవసరం లేకుండా మాట్లాడే మాటలు అన్నీ అహంభావన వలననే మాట్లాడుతున్నాము. అహంభావన వలన మాట్లాడే మాటలు అహంభావనను పెంచుతాయి. ఆహార విషయంలో, మాటల విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

దేహంలో నుండి విడిపోవటం వలన మోక్షంరాదు. ఎవడైతే ఈ దేహము నేను అంటున్నాడో ఆ నేను నుండి విడుదల పొందటమే మోక్షం. ఏ నేను అయితే దేహమునకు పరిమితం చేస్తోందో ఆ నేను నుండి విడుదల పొందటమే మోక్షం. ప్రపంచములో ఉన్న మంచి గొడవలకు, చెడ్డ గొడవలకు, నీ దేహ సంస్కారములకు, జీవలక్షణాలకు ఆశ్రయం ఇచ్చేది మనం చెప్పేనేనే. మనం ఏదైతే నేను, నేను అంటున్నామో దానిని

ఆశ్రయించే ఇవి అన్నీ ఉన్నాయి. ఆ నేను గనుక పడిపోతే దానిని ఆశ్రయించుకొనిఉన్నవి అన్నీ పడిపోతాయి.

గాఢనిద్రలో మనం అహంభావన లేకుండా ఉన్నాము. అలాగని ఎప్పుడూ నిద్రపోతాము అంటే ఎలాకుదురుతుంది. గాఢనిద్రలో నీ ప్రయత్నం అక్కరలేకుండానే అహంభావన ఎక్కడ నుండి పుట్టివస్తోందో అక్కడకు వెళ్ళి ఐక్యం అయిపోతోంది. అక్కడ నీ సాధనతో పనిలేదు. జాగ్రదావస్థలో నీవు ఎరుకతో ఉండగా విచారణ చేసి, సాధన చేసి అహంభావనను దాని పుట్టుస్థానం దగ్గరకు తీసుకొని వెళ్ళి ఐక్యం చెయ్యాలి. గాఢనిద్రలో అహంభావన ఎక్కడకు వెళ్ళి ఐక్యం అవుతోందో జాగ్రదావస్థలో నీ ప్రయత్నంతో అహంభావనను అక్కడే ఐక్యం చెయ్యాలి. దీనికి విచారణ అవసరము. మోక్షమును పొందాలి అనే కాంక్ష తగినంత లేకపోవటం వలన విచారణను ఏజన్మకు ఆ జన్మ మనం అశ్రద్ధ చేస్తున్నాము.

బ్రహ్మానుభవం పొందటానికి రూపాయలతో పనిలేదు. ఇది రూపాయలు చేసి పెట్టే పని కాదు. తెలుసుకోవాలి అనే కాంక్ష ఉండాలి. లోపల తపన ఉండాలి. ప్రపంచములో ఎన్ని భోగములు ఉన్నప్పటికి ధనంలేకపోతే వాడికి అనుభవించటానికి అవకాశము లేదు. ధనం ఉన్నవాడికి భోగం. ధనం లేనివాడికి భోగం లేదు. లోకంలో ఎన్ని గొడవలు ఉన్నప్పటికీ అవి అన్నీ అహంభావనను ఆశ్రయించి ఉన్నాయి. లోకంపోకడ ఎలా ఉన్నా, నీ దేహ ప్రారబ్దమును బట్టి అనుకూలపరిస్థితులు వచ్చినా, ప్రతికూలపరిస్థితులు వచ్చినా అహంభావన లేని వాడికి దుఃఖము లేదు. ప్రపంచములో అనేక రకాల భోగములు ఉండవచ్చు అయినా ధనం లేనివాడికి భోగంలేదు. అలాగే ప్రపంచములో దుఃఖ కారణములు అనేకం ఉండవచ్చు అయినా అహంభావన లేనివాడికి దుఃఖము లేదు.

నిజం అనేది ఏకంగా ఉంటుంది, శాంతముగా ఉంటుంది, పరిశుద్ధంగా ఉంటుంది. నీ మనస్సు ఎప్పుడైతే ఏకాగ్రం అయిందో, పవిత్రం అయిందో, పరిశుద్ధం అయిందో, నీ మనస్సుకు ఎప్పుడైతే శాంతి కలిగిందో అప్పుడు పరిశుద్ధమయిన ఆత్మలో అది ఐక్యమవుతుంది.

నీవు దేనినైతే పొందుదామని అనుకుంటున్నావో హృదయాంతరాళములనుండి ఆ వస్తువు మీద నీకు ప్రేమ కలగాలి, ప్రీతికలగాలి, ఇష్టంకలగాలి. ప్రేమ అనేది హృదయం యొక్క లోతులలో నుండి రావాలి. ఏ వస్తువునయితే పొందాలి అనుకొంటున్నావో దాని మీద ప్రేమ లేకుండా నీవు దానిని పొందలేవు. ఆహార నియమం వలన దానిని నీవు పొందలేవు. ఈ నియమములు అన్నీ దాని మీద ప్రేమకలగటానికి నీకు సహకారం చేస్తాయి. బాహ్యంగా ఉన్న సత్పురుషులతో నీవు సహవాసం చేయవచ్చు. అదే లక్ష్యం కాదు. నీ గుహలో ఉన్న సత్యవస్తువును తెలుసుకోవటానికి బాహ్యంగా ఉన్న సత్పురుషులు నీకు సహాయం చేస్తారు.

సంసారం వలన గాని, ధనం వలన గాని, విద్యవలన గాని, బాహ్యమైన భోగముల వలన గాని నీవు బ్రహ్మంను పొందలేవు. బ్రహ్మం ఎవరికి ఎరుకపడాలి అని అనుకొందో వారికి మాత్రమే ఎరుక పడుతుంది. మనకి దేవుడిని తెలుసుకోవాలి అని ఉంది. మనకు అన్నీ కావాలి, దేవుడూ కావాలి. కాని దేవుడు ఒక్కడే నాకు కావాలి అనుకొనే వాడికి మాత్రమే దేవుడు తెలియబడతాడు. మనకూ దేవుని తెలుసుకోవాలి అనే కాంక్ష ఉంది. ఆ కోరికను ఎక్కడో మారుమూలలకు గెంటివేసాము. దానికంటే ప్రముఖమైన కోరికలు మనకు ఉన్నాయి. ఇవి అన్నీ ఈశ్వరుడు లోపల ఉండి Watch చేసుకొంటూ ఉంటాడు. వాడి కన్ను మనం మూయలేము. వీడికి అర్హత ఉంది, నన్ను తెలుసుకోవాలి అనే కాంక్ష తప్పించి వేరే ఏదీ లేదు అని ఆయన అనుకొన్నప్పుడు పరమేశ్వరుడు ఎరుకపడతాడు.

మనం దేనికోసమైతే ప్రయత్నం చేస్తున్నామో ఆ వస్తువు మన హృదయంలోనే ఉంది. ప్రయత్నం మనం కొంతవరకే చేయగలము. కొంత ప్రయత్నం చేసిన తరువాత మనస్సు ప్రయత్నంతో పని లేకుండానే

దానంతట అదే బ్రహ్మంవైపుకు ప్రయాణం చేస్తుంది. మనకు తెలిసిన విషయమునే అభ్యాసము చేయగా చేయగా అది మనకు తేలిక అవుతుంది. కొంత ప్రయత్నం చేసిన తరువాత ప్రయత్నంతో సంబంధం లేకుండానే వస్తువు మనకు అనుభవంలోనికి వస్తుంది. కొంత దూరమే మనం ప్రయత్నం చేయాలి.

భగవంతుని తెలుసుకోవటానికి చేసే ప్రయత్నంలో కూడా కొంత మంది సిగ్గు పడుతూ ఉంటారు. వీరు సిగ్గు పడుతున్నారు అని కూడా భగవంతుడు చూస్తూ ఉంటాడు. వారి సొంత పనులు చేసుకొనేటప్పుడు సిగ్గు పడటం లేదు. మనలను తెలుసుకొనే ప్రయత్నంలో సిగ్గు పడుతున్నారు. వీరికి మనం తెలియబడటం ఏమిటి అని భగవంతుడు అనుకొంటాడు. ఈ మీటింగులకు రావటానికి మీరు సిగ్గు పడనవసరము లేదు. సిగ్గు పడుతూవస్తే మీరు సిగ్గు పడుతున్నారు అన్నది పరమేశ్వరుడు గుర్తిస్తాడు. సిగ్గు వలన ఆధ్యాత్మికంగానేకాదు, భౌతికంగా కూడా నష్టపోతూ ఉంటారు. ఏదైనా తెలియని విషయమును తెలుసుకొనేటప్పుడు కూడా సిగ్గు మనకు అడ్డు వస్తుంది. వారు ఏమనుకొంటున్నారు, వీరు ఏమనుకొంటున్నారు అని చూడకూడదు. అలా అనుకొనేది అహంకారమే.

సాధకుడు చేసే కృషి వలననే మోక్షం పొందుతాడా లేక ఈశ్వరుని కృప కూడా అవసరమా అని అడుగుతున్నారు. మనం చేసేది కృషి. దేవుడు ఇచ్చేది కృప. కృషి వలన కృప కలుగుతుంది. ప్రతీదానికి కృప అవసరమే. దేవుని తెలుసుకోవాలి అని మనం చేసే కృషి కూడా ఆయన కృప లేకుండా సాగదు. భగవంతుడు ఎప్పుడైనా మనకు జ్ఞాపకం వస్తున్నాడు అంటే అది మన తెలివితేటల వలన కాదు. ఆయన అనుగ్రహం వలననే మనకు జ్ఞాపకం వస్తున్నాడు. భగవాన్ చెప్పేది ఏమిటి అంటే ఆయన అనుగ్రహం వలననే ఆయనను పొందాలి అని చెపుతున్నారు.

భగవదనుభవం పొందేవరకూ శరీరములు వస్తూఉంటాయి, పోతూఉంటాయి. జ్ఞానము విషయంలో అశ్రద్ధ చేస్తారు గాని ఈ శరీరమును జాగ్రత్తగా చూసుకొంటారు. దేహ పోషణతోనే సరిపోతుంది. దేహమే సర్వస్వం అనుకొంటాడు. దేహబుద్ధి అంత బలీయంగా ఉంటుంది. సంసారం అంటే మనుషులు కాదు. మనస్సే సంసారం. ఈ శరీరంలో ఉండగానే మనస్సును సంస్కరించుకొని మనం బాగుపడాలి. మనకు దేహం మీద ఉన్న మోహం వలన, అలవాట్ల మీద ఉన్న మోహం వలన, లోకంలోని విషయముల మీద ఉన్న మోహం వలన మనలోపలే వస్తువు ఉన్నా గుర్తించే శక్తి మనకు రావటం లేదు. దీనికి మోహమే కారణము. మోహానికి కారణము దేహబుద్ధి.

నీకు సాధనాబలం, అంగబలం, అర్థబలం ఎన్ని ఉన్నప్పటికీ, నీకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ ఆత్మానుభవం పొందటం కోసం ఈశ్వరానుగ్రహం అవసరమే అంటున్నారు భగవాన్. ఎక్కడో ఆత్మ, మోక్షం వీటి దాకా ఎందుకు. నీకు ఏదైనా పదిరూపాయలు కలిసి వచ్చినా, పది రూపాయలు పోయినా దేవుడే చేసాడు అని అనుకోవాలి. అలా అనుకొంటే నీ మనస్సు కుదురుగా ఉంటుంది. కర్త ఈశ్వరుడే.

నీ చేతిలో ఉన్న పనిని హృదయపూర్వకంగా చెయ్యి, భక్తిగా చెయ్యి. నా చేతిలో ఉన్న పని గొడవ నీకు వద్దు. నేను ఎప్పుడు చెయ్యాలో, ఎలా చెయ్యాలో, ఎక్కడ చెయ్యాలో ఎప్పుడు చేస్తే అది నీకు ఉపయోగ పడుతుందో అది నేను చేస్తాను. నా చేతిలో ఉన్న పని గొడవ నీకు అనవసరము. నీ చేతిలో ఉన్న పని గొడవ ఏదో నీవు చూసుకో అని కృష్ణుడు పదేపదే చెప్పినా మన బుర్రకు ఎక్కటంలేదు. కృష్ణుడు చెప్పినట్లుగా నడుచుకొంటే మనకు ఆసక్తి నశిస్తుంది. చేస్తాడో, చేయడో ఆయన ఇష్టం. చేసినా ఆయన అనుగ్రహమే. చేయకపోయినా ఆయన అనుగ్రహమే. అది అంతా ఆయన చూసుకొంటాడు.

మేము భక్తులము. అది అలా జరగాలి, ఇది ఇలా జరగాలి అని అనుకొన్నాము. దేవుని అడిగాము కాని

అలా జరగలేదు అని భగవాన్‌తో చెపితే ఇవి అన్నీ శరణాగతి పొందినవాడు అడిగే ప్రశ్నలేనా అన్నారు భగవాన్. శరణాగతి పొందినవాడు వాడి సంకల్పమును విడిచిపెట్టేస్తాడు. భగవంతుడు చేసాడు, చెయ్యలేదు అని అనడు. చేసాడు, చెయ్యలేదు అనేవాడు శరణాగతి పొందినవాడిలో ఉండడు. ఇది ఇలా జరగాలి, అది అలాజరగాలి అనుకొనేవాడిని ఈశ్వరుడికి ఇచ్చి వేయాలి. అప్పుడు వాడు చల్లబడతాడు. జరగవలసినది ఏదో ఆయన ద్వారా జరుగుతూ ఉంటుంది. దేహమును ప్రారబ్దమునకు వదిలివేయండి. భగవదనుభవం పొందటం కోసం మీరు త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయండి. కాలమును పాడుచేసుకోవద్దు. మరణించే టైము వచ్చినపుడు కొద్దికాలం ఆగమంటే ఆగడు. ఒక్క క్షణం కూడా ఆపు చేయడు.

శ్రద్ధ చాలా ముఖ్యం. దేవుని అనుగ్రహం మన అందరిమీద ఉంది. శ్రద్ధ ఉన్నవాడు దానిని అందుకొంటాడు. శ్రద్ధలేనివాడికి దానిని అందుకొనే అర్హత ఉండదు. శ్రద్ధ లేనివాడికి దేవుని అనుగ్రహం ఉంది అనే విషయం కూడా తెలియదు. శ్రద్ధ వలననే జ్ఞానం కలుగుతుంది అని కృష్ణుడు గీతలో చెప్పాడు. అశ్రద్ధ పనికిరాదు, సోమరితనం పనికిరాదు.

స్వతంత్రమైన సుఖం, స్వతంత్రమైన ఆనందం, స్వతంత్రమైన శాంతి నీ హృదయంలో నుండి రావాలి. దానికోసమే నీవు ప్రయత్నం చేయాలి. నీవు సుఖం కోసం, ఆనందం కోసం, శాంతి కోసం బాహ్య వ్యక్తుల మీదగాని, బాహ్య వస్తువుల మీదగాని, బాహ్య పరిస్థితుల మీద గాని ఆధారపడితే ఈనాటికైనా, ముందునాటికైనా నీకు ఆశాభంగం తప్పదు అంటున్నారు భగవాన్. దేహప్రారబ్దమును బట్టి డబ్బు అధికారం వస్తే రావచ్చును. వాటిమీద మటుకు నీ ఆనందం కోసం ఆధారపడవద్దు. వాటిమీద ఆధారపడితే అవి పోయిన వెంటనే దుఃఖము నిన్ను తరుముకొంటూ వస్తుంది. ఇటువంటి చిల్లర గొడవలు వద్దు. నీ ప్రయత్నం అంతా పరమసత్యం మీద గురిపెట్టు.

విరామం లేకుండా, విశ్రాంతి లేకుండా, శ్రమ అనుకోకుండా కృషి చేస్తూఉంటే వస్తువు తెలియబడుతుందా అని అడిగితే అలాగ కృషి చేస్తున్న యోగికి, అలా శ్రమ పడుతున్న సాధకుడికి ఈశ్వరానుగ్రహం సహాయంతో వస్తువు తెలియబడుతుంది అని భగవానే చెపుతున్నారు.

హృదయంలో నుండి నేను అనే తలంపు వస్తోంది. నేను అనే తలంపు వచ్చాక ఇతర తలంపులు అంటే మనస్సు వస్తోంది. మనస్సు వచ్చాక దేహం వస్తోంది. దేహం వచ్చాక ప్రపంచం వస్తోంది. అసలు సత్య వస్తువు లేకపోతే నేను అనే తలంపు లేదు. నేను అనే తలంపు లేకపోతే మనస్సు లేదు. మనస్సు లేకపోతే దేహం లేదు. దేహం లేకపోతే ప్రపంచంలేదు.

మాకు మోక్షం కావాలి అని భగవాన్‌ను ఎవరైనా అడిగితే వచ్చిన దారిన వెళ్ళిపో అనేవారు భగవాన్. భౌతికంగా చూస్తే మీరు వచ్చిన దారిన వెళ్ళిపోతే మీరు మీ ఇంటికి వెళ్ళిపోతారు. అలాగే ఆధ్యాత్మికంగా కూడా మీరు వచ్చిన దారిన వెళ్ళిపోతే హృదయగుహలోనికి వెళ్ళిపోతారు. అక్కడే దేవుడు ఉన్నాడు అప్పుడు దేవుడు పొందే శాంతి, ఆనందం మీకు ఇచ్చేస్తాడు.

మీరు స్వల్పమైన విషయములమీద, అప్రధానమైన విషయముల మీద మీ మనస్సును పెట్టకండి. మీ మనస్సుకు ఉన్న శక్తిని పాడుచేసుకోవద్దు. ఈ రోజు ఉండి రేపు పోయే గొడవల కోసం ప్రయత్నం చేయ వద్దు. ధనము, గౌరవము ఇవి అన్నీ స్వప్న సమానము. మీరు ఎలాగు కృషి చేస్తున్నారు కదా ఎప్పుడూ ఏదైతే ఉందో దానిని తెలుసుకోవటానికి కృషి చేయండి. అంతేగాని చిల్లరగొడవల లోనికి వెళ్ళవద్దు. దేనిని తెలుసుకొన్నాక స్వతంత్రమైన సుఖము, ఆనందము కలుగుతుందో దానిని తెలుసుకోండి. తాత్కాలికంగా ఉండే గొడవలతోటి, స్వప్నసమానమైన విషయములతోటి మనకు పని ఏముంది అంటున్నారు భగవాన్.

మీ దృష్టి అంతా ఆత్మ మీదే పెట్టుకోండి. ఆత్మను చింతించండి. ఆత్మకోసం జీవించండి. అవసరమైతే ఆత్మకోసం ప్రాణం పోగొట్టుకోండి. మీ లక్ష్యము ఆత్మజ్ఞానమే. మీరు ఎప్పుడైతే ఆత్మానుభవం పొందారో మిమ్ములను బంధించే గొడవలు ఏమీ మీ దగ్గరకు రావు. మీరు బంధించబడటం మీ చేతులలో నే ఉంది, మీరు ముక్తిని పొందటం కూడా మీ చేతులలోనే ఉంది. విషయములను స్మరిస్తూ బంధించబడతారా లేక ఆత్మను స్మరిస్తూ ముక్తిని పొందుతారా అని భగవాన్ అడుగుతున్నారు. ఆత్మ తప్ప ఇతర విషయములు మీకు వద్దు. దేహయాత్ర జరగటం కోసం మీ పని మీరు చూసుకొంటూ మీ దృష్టిని అంతా ఆత్మ మీదే పెట్టండి. అదేలక్ష్యంగా పెట్టుకోండి. అది లక్ష్యంగా పెట్టుకొంటే ఎప్పుడైనా కాలుజారినా లక్ష్యం జ్ఞాపకం వస్తుంది, కాలు దగ్గరకు లాగుకొంటాడు. లక్ష్యం లేనివాడు కాలుజారితే చతికిలపడతాడు.

కుయుక్తులవలన, కుతంత్రాల వలన ఆత్మ తెలియదు. చర్చల వలన ఆత్మ తెలియదు. వాదప్రతివాదముల వలన ఆత్మ తెలియదు. వస్తువు ఉందా, లేదా అనే అనుమానం, సంశయం ఉంటే అది తెలియదు. ప్రతీ విషయానికి సందేహించే వాడు ఈ లోకంలోనూ, పరలోకంలోనూ కూడా ఏదీ సాధించలేడు. భగవాన్ ఏమని చెపుతున్నారు అంటే మీలో ఒక నగ్నసత్యం ఉంది. అది లేకుండా మీరు లేరు. అయితే ఆ నగ్నసత్యము చర్చలవలన, వాదనలవలన, తెలియదు. అది ఉందా, లేదా అనే అనుమానం వద్దు. నీ హృదయంలో ఉంది అనే నిర్ణయానికి ముందురావాలి. అణిగిన మనస్సు, నియమింపబడిన మనస్సు మాత్రమే అంతర్ముఖమవుతుంది. అంతర్ముఖమయిన మనస్సుకు నీ హృదయంలో ఉన్న సత్య వస్తువు తెలియబడుతుంది.

శాస్త్రము ఏపని అయితే చేయమని చెప్పిందో అది చేస్తూ, ఏది వద్దని చెప్పిందో అది మానివేస్తూ అలాగ నీవు సాధన చేస్తే ఆవస్తువు ఉందో లేదో నీకు తెలుస్తుంది. శాస్త్రము ఎంత విశాలబుద్ధితో చెప్పిందో అంత విశాల బుద్ధి మనకు లేక, మన మనస్సులో ఉన్న ఇరుకుతనం వలన మనం పాడైపోతున్నాము. శాస్త్రము చెప్పిన ప్రకారము, జ్ఞానులు చెప్పిన మాటల ప్రకారము నడుస్తూ ఉంటే ఒక్క జన్మలోనే బ్రహ్మానుభవం కలుగకపోయినా బ్రహ్మానుభవంకు సంబంధించిన శాంతి, ఆనందము, దాని జాడలు నీకు తెలుస్తాయి అంటున్నారు భగవాన్. కిచెన్‌లోకి వెళ్ళకపోయినా దగ్గరకు వెళ్ళినా కూర యొక్క వాసనలు మనకు ఎలా తెలుస్తాయో అలాగే బ్రహ్మంకు కొద్దిగా దగ్గరకు వెళ్ళినా దాని శాంతి, ఆనందము నీకు తెలుస్తాయి అంటున్నారు. వస్తువుకు దగ్గరగా వెళ్ళనక్కరలేదు కొంచం దూరంగా ఉన్నప్పటికీ దానికి సంబంధించిన లక్షణాలు అన్నీ నీకు తెలుస్తూ ఉంటాయి.

ఏ రాముడో, కృష్ణుడో, వశిష్ఠుడో అటువంటి స్నేహాలు నీకు దొరకకపోవచ్చును. వస్తువు అనుభవంలో ఉన్నవారు నీకు దొరకకపోవచ్చును. వస్తువు అనుభవంలో ఉన్నవారు నీకు దొరకక పోయినా ఆ వస్తువు గురించి కొంత తెలిసినవారు దొరికితే వారిని పట్టుకొని తంటాలు పడండి అని చెపుతున్నారు.

గురువు ఏమిచేస్తాడు అంటే శిష్యుడు ఏస్థాయిలో ఉన్నాడో ఆస్థాయికి దిగిపోయి చెపుతాడు. ఎవడికైతే పాఠం చెపుతున్నాడో వాడిని తన హృదయంలోనికి తీసుకొని చెపుతాడు. వాడు గురువు.

ఎవడైతే మమకారరహితముగా, అహంకారరహితముగా, ఆసక్తిరహితముగా పనిచేస్తున్నాడో ఆ పని వలన వచ్చే పుణ్య పాపములు ఆ జీవుడిని అంటవు.

★ ★ ★